ప్రజాశక్తి

సోమవారం 27 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే..

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

కార్మిక సంఘాల నాయకులతో ముఖాముఖిలో వక్తలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకు 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను శాసన మండలి ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో ముఖాముఖి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు సమస్య పరిష్కారం కోసం ఏ ఒక్క పార్టీ నేడు కృషి చేయడం లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసిపి ప్రభుత్వం కక్ష కట్టిందని తెలిపారు. ఆరేళ్లుగా శాసన మండలిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ మాధవ్ ఈ ప్రాంత అభివృద్ధిపై మాట్లాడింది ఏమీ లేదన్నారు. ఆయన ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ అధికార పక్షానికి వంత పాడుతూ కాలం గడిపారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై మండలిలో గళమెత్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, పాల్గొన్న రమాప్రభ, కార్మిక సంఘాల నేతలు

నిజాయితీగా పనిచేసే ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లోని ఉద్యోగులంతా అందుకు గట్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై శాసన మండలిలో ప్రశ్నించే, నిలదీసే గొంతు ఉండాలంటే రమాప్రభను గెలిపించాల్సిన అవసరం

మిగతా 2లో..



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఏర్పాట్లుపై సమీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : సమన్వయంతో పనిచేసి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023 ఏర్పాట్లు, అధికారులు చేపట్టాల్సిన పనులపై పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ జి.సృజన, జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ రాజాబాబులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని మార్చి 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు నియమించిన నోడల్ అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు రానున్నట్లు పేర్కొన్నారు. ముఖేష్ అంబానీ, నవీన్ మిట్టల్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అంబాసిడర్లు, వ్యాపార వేత్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు కేటాయించిన విధులను పవర్ పాయింట్ మిగతా 2లో..

ఉక్కు దీక్షల్లో కాంట్రాక్టు కార్మికులు

▶ వార్త 2లో.

ఓటమి భయంతో వైసిపి అక్రమాలు, అడ్డదారులు

▶ వార్త మెయిన్‌లో..

ఔషధ తయారీలో నాణ్యతపై దృష్టి

- ప్రమాణాల పరిశీలన
- మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్ట్ తప్పనిసరి
- 'ప్రజాశక్తి'తో ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో దువ్వాడ, చిప్పాడ ఎస్ఇజెడ్, పరవాడ జెఎన్‌పిసి, అచ్యుతాపురం, నక్కపల్లిల్లో 120 బల్క్ డ్రగ్ యూనిట్లు, ఆరు ఫార్ములేషన్ యూనిట్లు ఉన్నాయి. మెడికల్ ఆక్సిజన్ తయారీ యూనిట్లు పది ఉన్నాయి. ఔషధ పరిశ్రమల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ఔషధ ఉత్పత్తుల నాణ్యత ఉన్నదీ, లేనిదీ పరిశీలిస్తాం. ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందించేలా సూక్ష్మస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాం. నాణ్యత సరిగాలేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మెడికల్ షాపుల్లో తప్పనిసరిగా ఫార్మాసిస్టు ఉండాలి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి గడువు ప్రకారం నిర్దేశిత రుసుం చెల్లించకపోతే ఔషధ పరిశ్రమల అనుమతులు





రద్దవుతాయి' అని ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖరరావు తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శాఖాపరమైన సేవలు, బాధ్యతలను వివరించారు. ప్రధానాంశాలు ఆయన మాటల్లోనే..

ఔషధ పరిశ్రమల్లో ఏయే తనిఖీలు నిర్వహిస్తారు ?

ప్రజలకు నాణ్యమైన ఔషధం అందించేలా చూస్తాం. ఏడాదికి ఒకసారి ఔషధ పరిశ్రమల్లో మందుల తయారీ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నిబంధనల ప్రకారం వుందా ? లేదా ? అని పరిశీలిస్తాం. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఇన్‌స్పెక్టర్, డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా ఔషధ ఉత్పత్తులకు పొందిన అనుమతుల ప్రకారం ప్రమాణాలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఔషధ తయారీలో నాణ్యతపై దృష్టి

పాటిస్తున్నాయా ? లేదా? అని తనిఖీలు నిర్వహించాక లైసెన్సింగ్ అథారిటీకి నివేదిస్తాం. రెగ్యులర్ తనిఖీలతో పాటు డబ్ల్యుహెచ్ఒ, జిఎంపి ప్రమాణాలపై తనిఖీలు వంటివి వుంటాయి.

ఔషధ తయారీలో లోపాలుంటే తీసుకొనే చర్యలేంటి ?

ప్రతి కంపెనీ అంతర్గత ఆడిట్ చేసుకుంటోంది. ఎగుమతి ఆధారిత కంపెనీలన్నీ యునైటెడ్ స్టేట్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆడిట్లు చేసుకుంటాయి. గుడ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ ఫాలవుతుందా ? లేదా ? అనేది శాఖాపరంగా చూస్తాం. ఇవన్నీ నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి దోహదపడతాయి. లేకపోతే 'డ్రగ్ అండ్ కాస్మొటిక్ యాక్ట్ షెడ్యూల్ ఎం' ప్రకారం ఉత్పత్తి తయారీ నిబంధనలు, ఉత్పత్తి ప్రొటోకాల్స్ ఎలా ఉన్నాయనేది పరిశీలించి సర్టిఫికెట్ ఇస్తుంటాం. లోపాలు గుర్తిస్తే వాటిని సరిచేసుకోవాలని వార్నింగ్ లెటర్స్ ఇస్తాం. భిన్నంగా వ్యవహరిస్తే ఉత్పత్తి నిలుపుదలకు ఉత్తర్వులు ఇవ్వడం, అనుమతులు రద్దుచేయడం వంటి చర్యలు తీసుకుంటాం.

అనుమతుల్లేకుండా ఉత్పత్తి చేసే కంపెనీలపై ఏ తరహా చర్యలుంటాయి ?

అనుమతుల్లేని ఔషధం ఉత్పత్తి చేసినట్లు గుర్తిస్తే అన్ లైసెన్స్‌డ్ కింద యూనిట్‌ను సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఈ తరహా ఉత్పత్తులకు అవకాశం లేకుండా ఫార్మా యూనిట్లలో అనేక రకాల తనిఖీలు నిర్వహిస్తుంటాం. డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా అప్రూవ్డ్ ఉత్పత్తుల ప్రకారం అనుమతులు ఇస్తాం. కొత్త డ్రగ్ తయారు చేసుకోవాలన్న అప్రూవల్ వుండాలి. అనుమతి తీసుకోకుండా తయారు చేస్తున్న ఔషధ ఉత్పత్తులు ఏమైనా వున్నాయా ? లేదా ? అనేది తెలుసుకునేందుకు గిడ్డంగుల్లో కూడా తనిఖీలు చేస్తుంటాం.

ఈ ఏడాది కొత్త యూనిట్లు వచ్చాయా ?

ఈ ఏడాది కొత్తగా ఐదు ఫార్మా యూనిట్లకు అనుమతులు ఇచ్చాం. ఇవి అచ్యుతాపురం ప్రాంతంలో ఏర్పాటుకానున్నాయి. సింగిల్ విండో పాలసీ కింద 30 పని దినాల్లో అనుమతులు మంజూరు చేస్తాం. దరఖాస్తు చేసుకున్న ఉత్పత్తులకు తగిన సౌకర్యాలు అక్కడవున్నాయా ? లేదా ? అని పరిశీలిస్తాం. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్దేశిత రుసుం కాలపరిమితిలోపు చెల్లించకపోతే యూనిట్ అనుమతి రద్దవుతుంది.

మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్టు ఉండాలన్న నిబంధన అమలవుతుందా ?

చట్టం ప్రకారం మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్టు ఉండాలి. మెడికల్ షాపు లైసెన్సు కోసం దరఖాస్తు చేసినప్పుడు ఫార్మాసిస్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొంటే లైసెన్సు మంజూరు చేస్తాం. తనిఖీల్లో ఫార్మాసిస్టులేనట్లు గుర్తిస్తే నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటున్నాం.

ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే.. కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

ఉందన్నారు. డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం, సిపిఎస్ రద్దు కోసం, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం, ప్రైవేట్ విద్యా సంస్థల ఉద్యోగుల, ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు జె.అయోధ్యరామ్, స్టీల్ ఎఐటియుసి నాయకులు జె.రామకృష్ణ, బిహెచ్ఇఎల్ యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్ సహా ఎస్.ప్రసాద్ (షిప్ యార్డ్), పిఇసిహెచ్‌వి.సాగర్ (బిఎస్ఎన్ఎల్), పడాల రమణ (ఎఐటియుసి), లక్ష్మణరావు (విశాఖ పోర్టు), పిట్టా నారాయణమూర్తి (జింక్ ఎంప్లాయీస్ యూనియన్), బిబి.గణేష్ (ఎల్ఐసి), పలువురు హెచ్‌పిసిఎల్, డాక్‌యార్డ్ యూనియన్ల నాయకులు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. సదస్సుకు సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రతినిధులు బస చేసే హోటళ్ల వద్ద సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అతిథులు బస చేసే హోటళ్ల వద్ద, విమానాశ్రయం వద్ద, ఎయు గ్రౌండ్‌లోనూ వైద్య ఆరోగ్య శాఖ నుంచి మెడికల్ టీంలు, అంబులెన్స్, మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఎంజిఎంలో సాంస్కృతిక కార్యక్రమాలను టూరిజం అధికారులు చూసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్త పడాలని ఎపిఇపిడిఎల్ ఎస్ఇని ఆదేశించారు. పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలను విమానాశ్రయంలో రిసీవ్ చేసుకోవాలని, వారికి అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సిహెచ్.రంగయ్య, పరిశ్రమల శాఖ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

సమ్మిట్ ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్, పరిశ్రమల శాఖ కమిషనర్ సృజన తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ 25 దేశాల నుంచి పారిశ్రామిక ప్రముఖులు హాజరవుతున్నారని, 7500 మంది ఇప్పటివరకు రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు.

ఉక్కు దీక్షల్లో కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి పోరాటాలను మరింత ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతామని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 745వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి గంగారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరమైతే ముందుగా నష్టపోయేది కాంట్రాక్టు కార్మికులేనని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణతో పాటు పలు విభాగాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

సిపి కార్యాలయం అదనపు అంతస్తు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని అదనపు అంతస్తును నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, దివీస్ సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) మధుసూదనరావుతో కలిసి ఆదివారం ప్రాంభించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ నగర పోలీసుల తరపున దివీస్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ అధికారులు వైఎస్.కోటేశ్వరరావు, సురేష్ కుమార్, డిసిపిలు కె.ఆనందరెడ్డి, జి.నాగన్న పాల్గొన్నారు.



అదనపు అంతస్తును ప్రారంభిస్తున్న సిపి శ్రీకాంత్

నేడు రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -చింతూరు

చింతూరు ఐటిడిఎ కార్యాలయం ప్రక్కనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన మేరకు ఈ నెల 27న సోమవారం పాడేరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.రత్నమాణిక్యం, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త ఎన్. కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని రంపచోడవరం, చింతూరు రెవిన్యూ డివిజన్‌లోని తలసీమియా వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు వినియోగిస్తారన్నారు. ఆసక్తి గల దాతలు స్థానిక డిగ్రీ కళాశాలకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి .పుల్లయ్య, స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ ఎన్‌వి. కోటిరెడ్డి, ఐటిడిఎ ఇన్‌ఛార్జి ఎపిఒ కె.సుజాత పాల్గొంటారు. ఈ శిబిరాన్ని ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే ప్రారంభిస్తారన్నారు.

ఎఒబిలో పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి -సీలేరు: ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా జేగేరుకొండ అటవీప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య శనివారం ఎన్‌కౌంటర్, ఆదివారం మావోయిస్టులు మందుపాతర పేల్చిన ఘటనలు వరుసగా చోటుచేసుకోవడంతో ఆంధ్రాఒడిశా ప్రాంతంలో పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తమైంది, ప్రత్యేక బలగాలు కూంబింగ్ ముమ్మరం చేయడంతోపాటు సరిహద్దుల్లోని ఔట్ పోస్టుల్లో భారీగా నిఘా పెంచి ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నారు.



మాట్లాడుతున్న రాంబాబు

చిరు ధాన్యాలు ఆరోగ్యకరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : చిరు ధాన్యాలు ఆరోగ్యకరమని మిల్లెట్స్ రాంబాబు అన్నారు. ఆదివారం ఉదయం గురుద్వారా దగ్గరలో ఉన్న ఓ ప్రైవేటు వసతి గృహంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. చిరుధాన్యాలను నానబెట్టి వండుకోవాలన్నారు. చిరుధాన్యాలు వందినప్పుడు వచ్చే గంజి తర్వాత రోజు తీసుకోవడం చాలా ఆరోగ్యకమైనదని వివరించారు. అల్లం, వెల్లుల్లి, మజ్జిగ మంచి బ్యాక్టీరియాను పెంచుతాయని పేర్కొన్నారు. చిరుధాన్యాలను నానబెట్టి, ఎండలో ఆరబెట్టి వాటిని పిండి చేసుకోవటం మంచిదన్నారు. ఆరబెట్టేందుకు నేతబట్ట వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో బికెఎస్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దర్జీల జీవనం దుర్భరం

- నాడు దర్జా... నేడు దయనీయం
- విస్తరిస్తున్న రెడీ మేడ్ రంగం
- పెరిగిన ముడిసరుకుల ధరలు
- రేపు టైలర్స్ డే

ప్రజాశక్తి - భీమునిపట్నం : గతంలో దర్జీల జీవనం ఒకింత దర్జాగా ఉండగా, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో నేడు దయనీయంగా, దుర్భరంగా మారిందనే చెప్పాలి. నానాటికీ విస్తరిస్తున్న రెడీమేడ్ రంగం, పెరుగుతున్న ముడిసరుకు ధరలు, విద్యుత్ ఛార్జీలు, దుకాణాల అద్దె, నేమ్ బోర్డులకు రుసుము, చెత్త పన్ను విధింపు లాంటి విధానాలు దర్జీల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

పెరిగిన ముడి సరుకు ధరలు..

ప్రతి ఏటా ముడి సరుకు ధరలు పెరుగుతూనే ఉన్నాయని టైలర్లు వాపోయారు. దారపుండల్లో మూడు రకాలు ఉన్నాయి. గత ఏడాది రూ.3లు ఉన్న దారపుండ ప్రస్తుతం రూ.6కు చేరింది. మరో రకం రూ.8 నుంచి రూ.10కి, ఇంకో రకం రూ.10 నుంచి రూ14కు పెరిగాయి. కాలర్ (బకరం) మీటరు ధర రూ.90 ఉండగా రూ.130కి, జిప్ ధర రూ.4నుంచి రూ.6కు, కత్తెర ధర రూ.200 నుంచి రూ.350కి పెరిగాయి. ప్రతి 15 రోజులకూ కత్తెర పదును పెట్టేందుకు రూ.25 నుంచి రూ.45, రూ.50కి పెరిగింది. టైలరింగ్ దుకాణాల నిర్వహణకు అద్దెలు పెద్ద మొత్తంలో పెరిగాయి. 7×7 దుకాణం అద్దె నెలకు ప్రస్తుతం రూ.6,500లు చెల్లిస్తున్న పరిస్థితి ఉందని పలువురు టైలర్లు ఆవేదన వ్యక్తంచేశారు.


దుస్తులు కుడుతున్న దర్జీలు

సుమారు వంద జతలు ఇస్త్రీ చేస్తే నెలకు విద్యుత్ ఛార్జీలు రూ.350 చెల్లించాల్సి రావడం ఇబ్బందికరమని టైలర్లు వాపోయారు. 2 ఎలక్ట్రికల్ కుట్టు మిషన్ల (జూకి కంపెనీ) పై టైలరింగ్ చేస్తే నెలకు రూ.1000 వరకు విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కుట్టు మిషను ధరలు కూడా పెరిగాయి. ఉషా కంపెనీ మిషన్ ధర రూ.12వేలు, ఎలక్ట్రికల్ కుట్టు మిషను ధర రూ.26వేలు. మిషను చిన్న మరమ్మతుకు గుర్తైనా రూ.100 నుంచి రూ.150 చెల్లిస్తున్నట్లు టైలర్లు వివరించారు.

చెత్త పన్ను విధింపు

ప్రతి ఇంటికీ చెత్త పన్ను విధింపు లానే, టైలరింగ్ దుకాణాలకు సైతం ఈ పన్ను వేశారు. నెలకు రూ.60 చెత్త పన్ను చెల్లిస్తున్నట్లు టైలర్లు చెబుతున్నారు. దుస్తులు కత్తిరించే క్రమంలో వచ్చిన రద్దును చెత్తగా పరిగణనలోకి తీసుకొని పన్ను వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. టైలరింగ్ దుకాణం ముందు ఉన్న చిన్నా, పెద్ద నేమ్ బోర్డులకు జివిఎంసి ఏడాదికి రూ.15 వందలు వసూలు చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని టైలర్లు ఐక్యంగా వ్యతిరేకించడంతో కొంత సడలింపు చేశారు. పెద్దగా ఉన్న నేమ్ బోర్డులకే ఏడాదికి రూ.15 వందలు వసూలు చేస్తున్నట్లు వివరించారు. ఇలా ఎడా, పెడా భారాలతో టైలర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

వృత్తిపరంగా టైలర్లకు అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. దుస్తులు కుట్టే క్రమంలో ఏకాగ్రత కలిగి ఉండడం వల్ల 40 ఏళ్లకే దృష్టి లోపం వస్తుందని, నిల్చొని కటింగ్ చేయడం వల్ల వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు వస్తున్నట్లు పలువురు టైలర్లు వివరించారు.

ఒక జత దుస్తులు కుట్టాలంటే 6గంటల సమయం పడుతుంది. ఇందుకు రూ.600 మజూరి వస్తుందని, వర్కర్ ఇందులో భాగస్వామి అయితే దుకాణ యజమానికి రూ.200, వర్కర్‌కు రూ.200, దుకాణ అద్దె రూ.200 చొప్పున విభజిస్తామని కొందరు టైలర్లు తెలిపారు. ఒక్కోసారి కుట్టిన డ్రెస్‌లు కస్టమర్లు పట్టుకెళ్లకుంటే ఆర్థికంగా నష్టం జరుగుతుందని చెబుతున్నారు. తగరపువలసలో 70, భీమిలిలో 20 వరకూ టైలరింగ్ దుకాణాలు ఉన్నాయి.

50 ఏళ్లకే పింఛను ఇవ్వాలి



50 ఏళ్లకే పింఛను సదుపాయం కల్పించాలి. టైలరింగ్ దుకాణానికి విద్యుత్ సరఫరా 200 యూనిట్ల వరకు ఉచితంగా అందివ్వాలి. అర్హత కలిగిన టైలర్లందరికీ చేదోడు పథకం వర్తింప జేయాలి. తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

గిదుతూరి శ్రీనివాసరావు
టైలర్, తగరపువలస

రెడీమేడ్‌తో ఉపాధికి నష్టం



టైలరింగ్ వృత్తిని నమ్ముకొని ఉన్న వారిపై రెడీమేడ్ రంగం తీవ్ర ప్రభావం చూపింది. 25 ఏళ్ళుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాను. టైలరింగ్ చేసే క్రమంలో అనారోగ్య సమస్యలు వెంటాడు తున్నాయి. 40 ఏళ్లకే దృష్టి లోపం వస్తుంది. వెన్ను , కీళ్ల నొప్పులు తరచుగా వస్తున్నాయి.

పెంటపల్లి శ్రీనివాసరావు
టైలర్, తగరపువలస

సివి.రామన్ జీవిత విశేషాలపై పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డాక్టర్ సివి.రామన్ జీవిత విశేషాలపై విద్యార్థులకు ఆదివారం తెలుగు, హిందీ భాషల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు అధ్యక్షతన స్థానిక పిఎస్ఎం జివిఎంసి ఉన్నత పాఠశాలలో 28వ తేదీన జరుగనున్న సైన్స్ డే సందర్భంగా ఈ పోటీలు జరిగాయి. సివి రామన్ జీవిత విశేషాలు అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో 60 మంది, సివి రామన్ ఎఫెక్ట్ అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి ఈ నెల 28వ తేదీన బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

డిగ్రీ లిటరేచర్‌తో సమానంతరంగా ఉన్న రాష్ట్ర భాషా ప్రవీణలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మాన్సాస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ జివిఎస్.రాజు, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు సర్టిఫికెట్లు అందజేశారు.


డాక్టర్ సెంథిల్ మురుగన్‌కు జ్ఞాపికను అందిస్తున్న గీతం ప్రతినిధులు

ముగిసిన మైక్రోవాస్కుల్యూలర్ వర్క్‌షాప్

ప్రజాశక్తి -మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం ఆధ్వర్యాన రెండురోజులుగా సూక్ష్మ రక్త నాళాల చికిత్స విధానాలపై దంత వైద్యులకు నిర్వహించిన వర్క్ షాప్ ఆదివారం ముగిసింది. చెన్నైలోని సవిత దంతవైద్య కళాశాల రీకనస్ట్రక్టివ్ సర్జరీ, అంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సెంథిల్ మురుగన్ ఆధ్వర్యాన దంత వైద్యులకు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. కింది దవడ దెబ్బతిని రోగికి కాలి ఎముక నుంచి తీసిన భాగాలతో దవడను తిరిగి పునర్మించే అరుదైన చికిత్సను గీతం వైద్యకళాశాల ఆపరేషన్ థియేటర్ నుంచి తెరపై వైద్యులకు ప్రత్యక్షంగా గమనించే ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దంత వైద్యులు హాజరైన ఈ వర్క్ షాప్ ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతం దంతకళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపల్ డాక్టర్ డి.సీతారామరాజు, ఓరల్ సర్జరీ విభాగాధిపతి, ఫ్యాకల్టీ సభ్యుడు డాక్టర్ ఎన్‌వివి.సత్యభూషణ్ హాజరై డాక్టర్ సెంథిల్ మురుగన్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : సేవా స్ఫూర్తి అసోసియేషన్, అపోలో డయాగ్నొస్టిక్ సంయుక్త ఆధ్వర్యాన 10వ వార్డు పరిధి రవీంద్రనగర్ బస్టాపు సేవాస్ఫూర్తి భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రవీంద్రనగర్, ఆదర్శనగర్, గాంధీనగర్, తోటగరువు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు బిపి, సుగర్, ఈసీజీ తదితర వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాల్లో ఇక్కడ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సేవాస్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్ఎస్‌కెఎఐ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే విజేత విశాఖ

ప్రజాశక్తి -పిఎం పాలెం : 2వ ఎన్ఎస్‌కెఎఐ సౌత్ ఇండియా ఒపెన్ కరాటే ఛాంపియన్ షిప్ -2023 పోటీల విజేతగా విశాఖ నిలిచింది. మధురవాడ శిల్పారామం వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో విశాఖ, ద్వితీయ స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా కాకినాడ, తృతీయ స్థానంలో శ్రీకాకుళం జిల్లా నిలిచాయి. నేషనల్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ నిర్వాహకులు పి.వి.రమణమూర్తి ఆధ్వర్యాన నిర్వహించిన పోటీలకు ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాల నుంచి కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న 450 క్రీడాకారులతో 900 కరాటే ఈవెంట్లను నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులకు మెమోంటోలు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వస్త్రల్యా హాస్పిటల్ చైర్మన్ దుర్గ శేఖర్‌బాబు, టిడిపి 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షుడు మొల్లి లక్ష్మణ రావు, టిడిపి పార్లమెంటరీ తెలుగు యువత కార్యదర్శి, కెజిఆర్ క్యాటరింగ్ అధినేత గరె గురునాథ్, వివిఎస్ఆర్ క్యాటరింగ్ అధినేత నాగోతి రమేష్, భాస్కర్, 5వ వార్డు బి సి సెల్ అధ్యక్షుడు నమ్మి రమణ, మాలతంబ స్కూల్ ప్రిన్సిపల్ పిఎం.రాజు, పిల్లా బంగారురాజు, పిఎం.దినేష్ యాదవ్, పి.సరస్వతి, కనకాల కేశవ, ఎ.దిలీప్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన


మద్యం షాపునకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్దని స్థానికులు ఆందోళనకు దిగారు. 13వ వార్డు పరిధి రామకృష్ణాపురం కాలనీలో నివాసాల మధ్య ప్రభుత్వం మద్యం దుకాణం ఏర్పాటుకు ఏర్పాట్లు చేసింది. మద్యం షాపు ఏర్పాటు చేయబోయే షెడ్డు ముందు గ్రామస్తులందరూ ఏకమై ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మద్యం షాపునకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. నగర శివారు ప్రాంతం కావడంతో ఇప్పటికే గంజాయి బ్యాచ్‌లతో ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు మద్యం షాపు ఏర్పాటు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ కాలనీలో అందరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే తమ బ్రతుకులు మరింత నాశన మవుతాయని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మద్యం షాపు ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకుంటే నిరవధిక పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో స్థానిక సంఘం నాయకులు వంకర బాబూరావు, కాకర గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంతుని పెళ్లి రాట

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభం మండల కేంద్రంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న కుంతీ మాధవస్వామి గాలిగోపురం వద్ద అనంతుని పెళ్లి రాట ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఇఒ నానాజీబాబు సమక్షంలో పురోహితులు సీతారామాంజనేయులు పెళ్లిరాట కార్యక్రమాన్ని పూర్తిచేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు దంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిపి కె.రాంబాబు, స్థానిక సర్పంచ్ టి.పాప, ఎంపిటిసి కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ పుష్పార్చన, స్వామివారి నిత్య కల్యాణాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆర్జిత సేవలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా బంగారమ్మ పండగ

ప్రజాశక్తి-సింహాచలం: ఆదివారం గ్రామదేవత పైడితల్లమ్మ సోదరి బంగారమ్మ తల్లి అమ్మవారి పండగ మహోత్సవాన్ని ఆదివారం దేవస్థానం అధికారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ మహిళలు వేకువజాము నుంచే స్వామివారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో తోట బ్రదర్స్ ఆధ్వర్యాన భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో సిద్ధేంద్రయోగి నాట్యాలయం ఆధ్వర్యాన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథ నమామ్యహం, బ్రహ్మాంజలి, ఝనుత, శబ్దం, భావములోన బాహ్యమునందున, రాజం కొండ మీద, ఘల్లు ఘల్లు, దానగూడ లంబాడి పిల్లా, మొక్క జొన్న తోటలో, నోమి నోమన్నలారా, తదితర అంశాలను ప్రదర్శించారు. పల్లవి, రాఘవ, ఈశ, స్రవంతి, వేదిత, యశస్విని, కణిత, మోక్ష, భాషిత కళాకారులు నృత్యాలను ప్రదర్శించి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.


శిల్పారామంలో నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

క్షతగాత్రులకు రక్తం సంజీవిని

ప్రజాశక్తి -గాజువాక : క్షతగాత్రులకు రక్తం సంజీవిని లాంటిదని రాష్ట్ర దేవాంగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బీరక సురేంద్రబాబు అన్నారు. జివిఎంసి 79వ వార్డు పరిధి అగనంపూడి- స్టీల్‌ప్లాంట్ రోడ్డులో ఉన్న ముత్యాలహారం పౌండేషన్ ఛైర్మన్ బత్తుల కాళిదాస్ ఆధ్వర్యాన రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో కీర్తిశేషులు ముత్యాలమ్మ స్మారకంగా ఉచిత రక్తదాన శిబిరం ఆదివారం ఏర్పాటుచేశారు. సురేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాదాలు, ఆపరేషన్ల సమయంలో ఆయా బాధితులకు రక్తం ఎంతో అవసరమన్నారు. ఇది కొంటె దొరకని వస్తువు అన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎన్.వీరమణికంఠ మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు, పరిశ్రమలలో ప్రమాదాలు ఎక్కువగాక ఉంటున్నాయని, వారందరికీ రక్తం చాలా అవసరం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉక్కునగరం వెల్‌నెస్ కోచ్ ధర్మాల శ్రీనివాసరెడ్డి, ఎడిసి ఛైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, 79వ వార్డు టిడిపి కార్యదర్శి బొబ్బరి సూర్య, లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎం.మస్తానోరెడ్డి, అగనంపూడి శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనర్ విందుల పైడినాయుడు, పిఎస్ రాజు, ఉక్కు అధికారి పిల్లి చంద్రరావు, ఫార్మాసిటీ కార్మిక నాయకులు పాలవలస సత్యనారాయణ, బత్తుల శ్రీనివాస్, బత్తుల సత్యవతి, రోటరీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యలో నాణ్యత అవసరం

ప్రజాశక్తి -ములగాడ : సంపూర్ణ అక్షరాస్యత, విద్యలో నాణ్యత, సమానత్వాన్ని, జవాబుతనాన్ని పెంచడం, అతి తక్కువ ఖర్చుతో విద్యను అందుబాటులోకి తేవడం నూతన విద్యా విధానం లక్ష్యాలని, ఇవి ఆచరణలో సాధించగలిగితే దేశ రూపురేఖలే మారతాయని ఆంధ్ర లయోలా కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ ఎం.సహాయరాజ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో "నూతన విద్యా విధానం- మైనారిటీ విద్యా సంస్థలు ఎదుర్కొనే సవాళ్లు" అనే ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా సహాయరాజ్ హాజరై మాట్లాడారు. హేతువు, పరిశోధన, ప్రయోగం, విశ్లేషణ, విమర్శ, నూతన ఆలోచన ధోరణిల ప్రాతిపదికగా బోధన జరగాలని ఈ విధానం ఆశిస్తుందని తెలిపారు. అయితే భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే నెపంతో తిరిగి కుల వ్యవస్థ తన విశ్వరూపాన్ని చూపించే అవకాశం లేకపోలేదని అభిప్రాయపడ్డారు. సంస్కృతానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల శాస్త్రీయమైన విద్యా విధానం ఎంతవరకు సాధ్యపడుతుందని ప్రశ్నించారు. ప్రతి విద్యా వ్యవస్థా స్వయం సమృద్ధిని సాధించాలని, తన వనరులను తానే సమీకరించుకోవాలని చెప్పడం ద్వారా కార్పొరేట్ విధానాలు బలోపేతం అవుతాయేమో అనే భయాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షతన సాగిన సదస్సులో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొత్తుకు నిర్ణయించడం అభినందనీయం

ప్రజాశక్తి-మాధవధార : 2024వ సంవత్సరం ఎన్నికలలో రాజ్యాధికారాన్ని సాధించడం కోసం పలు భావసారూప్యత, ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాయపూర్‌లో జరుగుతున్న 85వ ప్లీనరీలో రెండో రోజు సమావేశంలో ప్రకటించడం హర్షణీయమని ఏపీ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం ఛైర్మన్ మూల వెంకటరావు అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పార్టీకి పొత్తు అవసరం అని తెలిపారు. ఈ ప్లీనరీ సమావేశం ద్వారా కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం దిశగా వెళ్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అధిష్టానంతో ప్రకటన చేయించడంలో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు కృషి అభినందనీయమన్నారు. ఎన్నికల్లో ఇవిఎంల స్థానంలో తిరిగి బ్యాలెట్ పేపర్ పద్ధతి ప్రవేశపెట్టాలని, పార్టీ పిరాయింపుల చట్టాన్ని మరింత పటిష్టం చేయాలని, అందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని, న్యాయస్థానాల ద్వారా పోరాటం చేయాలని నిర్ణయించడం అభినందనీయం అని పేర్కొన్నారు. పార్టీ పదవుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళలకు, యువకులకు కేటాయింపు నిర్ణయం హర్షించదగ్గదని తెలిపారు. కాంగ్రెస్ మాత్రమే రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సుపరిపాలన అందించగలదన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం దేశ, రాష్ట్రాల్లో ఉన్న అన్ని ప్రతిపక్ష పార్టీలూ కాంగ్రెస్‌తో నడవాలని కోరారు. 2024 ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలందరూ సైనికులు మాదిరిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



అప్పన్న సన్నిధిలో రథసారథి లక్ష్మణరావు

ప్రజాశక్తి-సింహాచలం: కల్యాణోత్సవంలో స్వామివారి రథానికి సారథ్యం వహించే రథసారథి లక్ష్మణరావు ఆదివారం సింహాద్రి అప్పన్న దర్శించుకున్నారు. దర్శనం అనంతరం గతంలో స్వామివారి రథానికి ఆట ఎక్కువ ఉందని, దానిని సరిచేసి రథయాత్ర సమయంలో ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని ఇఇ రాంబాబును కోరారు.

స్నేక్ సేవర్ వెబ్ సైట్ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : స్నేక్ సేవర్ సొసైటీ వెబ్‌సైట్‌ను మింది గ్రామంలోని మంత్రి నివాసంలో గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. స్నేక్ సేవర్ సొసైటీని స్థాపించి వన్యప్రాణుల సంరక్షణ, విష సర్పాల నుంచి ప్రజల్ని రక్షించడం కోసం రొక్కం కిరణ్‌కుమార్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఇళ్లల్లోకి, పరిశ్రమల్లోకి చొరబడే సర్పాల నుంచి అక్కడి వారిని కాపాడుతూ పట్టుబడిన సర్పాలను కొండప్రాంతాల్లో విడిచిపెట్టడం సాహసోపేత చర్య అని పేర్కొన్నారు. ఆపద అని తెలిసిన మరుక్షణమే సొసైటీ సభ్యులు అక్కడికి వెళ్లి ఎలాంటి సర్పాన్నైనా ధైర్యంగా పట్టుకొని ప్రజల్లో గుండె ధైర్యాన్ని నింపుతున్నారని కొనియాడారు. ఇలాంటి సాహసోపేత పనులు చేపట్టే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా www.snakesaverkiran.com పేరిట వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 68వ వార్డు వైసిపి నాయకుడు గుడివాడ లతీష్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

శ్రీధర్‌రెడ్డికి అభినందన సభ



శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టిడి) జాతీయస్థాయి సొసైటీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాది శ్రీధర్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారులుగా నియమించిన నేపథ్యంలో దొండపర్తిలోని బెస్ట్ వెస్ట్ హోటల్లో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరంలోని జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారులుగా నియమించటం హర్షణీయమన్నారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, స్టూడెంట్స్ ప్లేస్‌మెంట్ కోసం హెచ్‌ఆర్‌లు వివరాలు ప్రభుత్వానికి అందించాలని కోరారు. నూతన ఒరవడితో స్కిల్ ట్రైనింగ్ ద్వారా శిక్షణ పొందిన వారంతా ఆయా రంగాల్లో స్థిరపడేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం శ్రీధర్ రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్ సౌత్ ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు, విశాఖ చాప్టర్ ఛైర్మన్ ఒఆర్ఎం.రావు, సెక్రటరీ హేమ యాదవల్లి, ఎన్‌సి మెంబెర్స్ ఠాగూర్, అప్పారావు, మురళీ తదిదరులు పాల్గొన్నారు.

జిల్లా చేనేత విభాగం అధ్యక్షునిగా చిక్కా

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి చేనేత విభాగం విశాఖ జిల్లా అధ్యక్షునిగా గాజువాక ప్రాంతానికి చెందిన చిక్కా సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి నియామక పత్రాన్ని అందజేశారు. పదవి రావటానికి కృషి చేసిన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని ఆదివారం చిక్కా సత్యనారాయణ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. నేత కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో మరింత ఆదరణ లభించేలా సంబంధిత అధికారులతో చర్చిస్తానని తెలిపారు. తనకు పదవి లభించడానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్యే నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘాల ప్రతినిధులు కొలిపాక అప్పారావు, రాపర్తి సుబ్బారావు, నాలి శ్రీనివాసరావు, ఆకాశపు శంకర్, తెలు శ్రీనివాసరావు, దములూరి సత్యనారాయణ, గిడుతూరి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న చిక్కా సత్యనారాయణ

సాగర్‌నగర్ బీచ్‌లో క్లీనింగ్

ప్రజాశక్తి -మధురవాడ : జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యాన నగరంలోని సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో భాగంగా సాగర్ నగర్ బీచ్‌లో క్లీనింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 10వ విడత బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని సాగర్‌నగర్ వద్ద నిర్వహిస్తున్నామని, ఇప్పటికే విశాఖలో 9 విడతలుగా బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలను కొనసాగించామని చెప్పారు. సాగర తీర స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖవేలీ స్కూల్, డైట్ విద్యార్థులు, ఫారెస్ట్, రెవెన్యూ, జివిఎంసి, ఎన్‌సిసి, విఎంఆర్‌డిఎ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున తదితరులు

'ఉపాధి'కి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -కంచరపాలెం : ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన ద్వారా ఉద్యోగ కల్పనలో భాగంగా కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటిఐ నందు మార్చి 1వ తేదీ నుంచి పిఎంకెవి వై 4.0 ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలల కాల వ్యవధి కోర్సులకు ఉచితంగా శిక్షణ, ప్రయివేటు సంస్థల్లో ఉపాధి కల్పించనున్నట్లు ఓల్డ్ ఐటిఐ ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్ తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, ప్లంబర్ జనరల్, ఫీల్డ్ టెక్నీషియన్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సి, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై 18 నుంచి 45 సంవత్సరాల మధ్య గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. అభ్యర్థులు మరిన్ని వివరాలకు 9966861476, 9346258000 నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

శాఖాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి -గాజువాక : శాఖాహారంతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు రేవతీదేవి అన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యాన చినగంట్యాడ పరిసర ప్రాంతంలో శాఖాహార సద్భావన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయం శాఖాహార జగత్‌కి ప్రతి పిరమిడ్ మాస్టారూ కృషి చేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ శాఖాహార ర్యాలీని నిర్వహించి, కరపత్రం ద్వారా, స్లోగన్ ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సి.జగదీశ్వరి, పిఎస్ఎన్.మూర్తి, జి.పద్మావతి, బి.అప్పారావు, భాగ్య, రామకృష్ణ, శివాజీ, అప్పలరాజు, నీలకంఠం, అరుణ, రమాదేవి, లక్ష్మి, దమయంతి పాల్గొన్నారు.

మారికవలసలో జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలసలో ఆదివారం జనసేన సభ్యత్వ నమోదు చేపట్టారు. నూతన సభ్యత్వం, సభ్యత్వం ఉన్న వారికి రెన్యువల్ కార్యక్రమాన్ని మారికవలస రాజీవ్ గృహకల్పకాలనీ ఆంజనేయస్వామి గుడి వద్ద దేవర శివ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శేఖర్ శ్రీను బాబు, బీవీ.కృష్ణయ్య, యడ్ల గణేష్ యాదవ్, నారాయణరావు, సునీల్, సూరి, సూరిబాబు, ఆదినారాయణ, అప్పలనాయుడు, జె.సురేష్, లక్ష్మణ్, కిరణ్, చందాక సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక సంగివలస పోలమాంబ ఉత్సవాల సందర్భంగా పోలమాంబ యూత్ ఆధ్వర్యాన ప్రారంభం కానున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నేపథ్యంలో ఆదివారం విఎంఆర్‌డిఎ చైర్ పర్సన్ అక్కరమాని విజయ నిర్మల ట్రోఫీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాముడునాయుడు, వైసిపి నాయకులు మంగరాజు తదితరులు పాల్గొన్నారు. విన్నర్స్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


క్రికెట్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న విజయనిర్మల

సచివాలయ ఉద్యోగిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

వైసిపి నాయకుల దౌర్జన్యాన్ని ఖండించిన సిఐటియు

ప్రజాశక్తి-అనకాపల్లి : అడ్డూరు గ్రామ సచివాలయ ఉద్యోగిపై వైసిపి నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ శంకరరావు, జి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చోడవరం మండలం అడ్డూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి సతీష్ శ్రీనివాస్‌పై ఆ గ్రామ వైసిపి నాయకులు యలమంచిలి పోతినాయుడు సచివాలయంలోనే దాడి చేయడం అమానుషమన్నారు. ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగులపై ఇటువంటి దాడులు తరచుగా జరగడం హేయమన్నారు. గతంలో హెల్త్ సెక్రటరీపై కూడా ఇటువంటి దాడి జరిగిందన్నారు. ఇటువంటి దాడులతో సచివాలయ సిబ్బంది అభద్రతా భావంతో విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఉందని, ప్రభుత్వం వీరికి తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఒక ప్రభుత్వ ఉద్యోగిపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణించి పోతి నాయుడుపై కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

119వ రోజుకు నాబ్ నిర్వాసితుల దీక్షలు



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - రాంబిల్లి : నావల్ బేస్ నిర్వాసితుల దీక్షలు ఆదివారం నాటికి 119వ రోజుకు చేరుకున్నాయి. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, వాడ నరసాపురం నేవల్ బేస్ మెయిన్ గేట్ ముందు రోడ్డుపై బైఠాయించి నిర్వాసితులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడం ఖాయమని ఎనిమిది గ్రామాలు నిర్వాసితులు, జెఎసి పెద్దలు స్పష్టం చేశారు. నాలుగు నెలలుగా నిరాటంకంగా ఎనిమిది మత్స్యకార గ్రామాల నిర్వాసితులు ఆందోళన చేస్తుంటే, అధికారులకు గానీ, నేతలకు గానీ తమ సమస్యలు పట్టకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి, సమస్యలను పరిష్కరించి, తమకు న్యాయం చేయకుంటే, అనకాపల్లి వరకు పాదయాత్ర నిర్వహించి, జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

450 మందికి ఉచిత కంటి పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 101వ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 450 మంది కంటి రోగులను పరీక్షించారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో నిర్వహించిన శిబిరానికి 490 మంది కంటి రోగులు హాజరయ్యారు. కంటి పరీక్షలు అనంతరం 32 మందికి ఉచితంగా అద్దాలను పంపిణీ చేశారు. అలాగే 88 మందికి మందులు ఇచ్చారు. 43 మంది కంటి రోగులకు కేటరాక్ట్ సర్జరీ చేయించాలని వైద్యులు సూచించారు. మిగిలిన వారికి వచ్చే శిబిరానికి రావాలని టోకెన్లు అందజేశారు. వైద్య శిబిరానికి విచ్చేసిన రోగులకు మజ్జిగ, మంచినీరు, పులిహోర సదుపాయాలను కల్పించారు.

ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి మాట్లాడుతూ, బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఈ ప్రాంతప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా ఉండాలనే లక్ష్యంతో ఉచిత నేత్ర వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాండిక్స్ సిబ్బంది, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

వివేక హత్య కేసులో నిందితులకు వైసిపి సహకారం

మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్



మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు వైసిపి ప్రభుత్వం సహకరించడం బాధాకరమని అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వివేక హత్య కేసు జరిగిన 2019లో సాక్షి దినపత్రికకు ఎడిటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి అప్పట్లో నారాసుర రక్త చరిత్ర పేరుతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్త, నేడు అబద్ధమని సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌పై సిబిఐ అధికారులు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌తో తేటతెల్లమైందన్నారు. ఇపుడు ఏం చేయాలో పాలుపోక సజ్జల భుజాలు తడుముకుంటున్నారని ఆరోపించారు గూగుల్ టేక్ వంటి అధునాతన టెక్నాలజీతో ఈ హత్య కేసులో దోషులను పట్టుకునే ప్రక్రియను . సిబిఐ అధికారులు కొలిక్కి తెస్తున్న సమయంలో చంద్రబాబు, బిటెక్ రవిల ఫోన్‌నెంబర్లను పరిశీలించాలని కొత్త వాదనను సజ్జల తెరపైకి తేవడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. జగన్ రెడ్డిని దోషిగా నిలబెట్టేందుకు సిబిఐని చంద్రబాబు మేనేజ్ చేస్తున్నారని సజ్జల అమాయకంగా చెబుతున్నారన్నారు. వివేకా హత్య కేసులో అసలు వాస్తవాలు, జరిగిన,జరుగుతున్న పరిణామాలేంటో ఇప్పటికే రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఈ కేసులో విచారణను ముందుకు సాగకుండా వైసిపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నిందో అందరికీ తెలిసిందేనన్నారు. సిబిఐ కోర్టులో సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌పై సిబిఐ దాఖలు చేసిన అఫిడవిట్ గురించి దినపత్రికలన్నీ ప్రాధాన్యతనిచ్చి ప్రచురిస్తే, సాక్షి దినపత్రికలో ఒక్క వాక్యం కూడా రాకపోవడంపై సజ్జల ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సిబిఐ విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ఏంచేయాలో పాలుపోని వైసిపినేతలు, ఇపుడు చంద్రబాబు, లోకేష్, పార్టీ శ్రేణులపై బూతులతో ఎదురుదాడి చేస్తున్నారన్నారు. వివేకాహత్య కేసులో ఒంటరి పోరాటం చేస్తున్న సునీత రెడ్డి, సౌభాగ్యవతమ్మకు న్యాయం జరగాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్లమెంటరీ అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు పాల్గొన్నారు.

పరదేశిమాంబ పండగకు పటిష్ట బందోబస్తు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో ఈ నెల 28న నిర్వహించనున్న పరదేశిమాంబ పండగ బందోబస్తు ఏర్పాట్లను డిఎస్‌పి పి.శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాసరావు ఆర్థికసాయంతో పండుగను వైభవంగా నిర్వహించడంతోపాటు పండగ సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్ ప్రోగ్రాంకు పలువురు సినీ హీరోయిన్‌లు, జబర్దస్త్ నటులు, ఇతర డాన్సర్లు రానున్న నేపథ్యంలో వినోద కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలిరానున్నారన్న అంచనాతో ప్రదర్శన వేదిక, పార్కింగ్ స్థలాలు, ఇతర ఏర్పాట్లపై డిఎస్‌పి పరిశీలించారు. సిఐ పి.రంగనాథం, ఎస్ఐ ఎల్.సురేష్, సిబ్బంది, బోకం శ్రీనివాస్, సర్పంచ్ బోకం స్వామినాయుడు, ఉప సర్పంచ్ వనం దేముడుబాబు, బోకం కాసుబాబు, మాజీ సర్పంచ్ బోకం అప్పల నాయుడు పాల్గొన్నారు.

అనురాధకు అభినందన



అనురాధను అభినందిస్తున్న చీడికాడ వైసిపి నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన ఈర్లె అనురాధను తారువలోని ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం చీడికాడ మండల పార్టీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ,తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, ఎంపిపి కురచా జయమ్మ, స్వామినాయుడు, పరవాడ రామారావు, మహేష్, చుక్క అప్పలనాయుడు, ఈర్లె చైతన్య పాల్గొన్నారు.

వైభవంగా దీపిక లేడీస్ క్లబ్ ఆనందమేళా



ఆనంద్ మేళాను ప్రారంభిస్తున్న సంజయ్‌కుమార్

ప్రజాశక్తి - పరవాడ: దీపికా లేడీస్ క్లబ్, ఎన్‌టిపిసి సింహాద్రి సంయుక్త ఆధ్వర్యాన దీపాంజలి నగర్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం ఆనంద్ మేళా 2023ను వైభవంగా నిర్వహించారు. 'భారతీయ వారసత్వం, సంస్కృతి' థీమ్‌తో ఈ ఏడాది నిర్వహిస్తున్న ఆనందమేళాను ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షులు అంజు సిన్హా అతిథులు, ప్రముఖులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంజు సిన్హా మాట్లాడుతూ భారతీయ వారసత్వం, సంస్కృతి పరిరక్షణ, ప్రోత్సాహించడం, సమాజ ఉద్ధరణలో దీపిక లేడీస్ క్లబ్ పాత్ర, సహకారాన్ని వివరించారు. మేళా సందర్భంగా డిఎవిస్ బాలికల సాధికారత కోసం సిఎస్ఆర్ నిధులతో జిఐఎమ్ మెరిటోరియస్ విద్యార్థులు 10 మందికి సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మహిళా క్లబ్‌ను ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను గుర్తుకు తేవడం, వాటిని పరిరక్షించడానికి ఇలాంటి మేళాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సింహాద్రి సిపిఎస్-3, యుఎస్‌ఎస్‌సి, ఇతర సీనియర్ అధికారులు, దీపిక లేడీస్ క్లబ్ సీనియర్ సభ్యులు, అసోసియేషన్ ఆఫీస్ బేరర్లు అన్ని శాఖల ఉద్యోగులు, అసోసియేట్‌లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ పాలిసెట్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు మోడల్ పాలిసెట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు 480 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణరావు తెలిపారు. పాలిసెట్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ పరీక్షను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తామన్నారు.



పాలిసెట్ నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పునాది రాయి పడని జగనన్న కాలనీ

- కొండ ప్రాంతంలో చింతలపాలెం లేఅవుట్
- 286 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు
- నిర్మాణానికి ఆసక్తి చూపని లబ్ధిదారులు
- ప్రభుత్వ సాయం సరిపోదని నిరాసక్తత
- ఏపుగా పెరిగిన తుప్పలతో అడవిలా లేఅవుట్



తుప్పలు, పిచ్చిమొక్కలతో నిండి ఉన్న జగనన్న కాలనీకి కేటాయించిన స్థలం

ప్రజాశక్తి- కశింకోట : ఉగాదికి జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలు జరిపించాలని ఒకవైపు ప్రభుత్వం హడావిడి చేస్తుంటే, కశింకోట మండలం చింతలపాలెంలో 224మందికి ఒకేచోట ఇళ్లస్థలాలకు పట్టాలిచ్చినా ఒక్కరంటే ఒక్కరైనా నేటికీ నిర్మాణం ప్రారంభించలేదు. గ్రామంలో ప్రభుత్వస్థలం అందుబాటులో లేని పరిస్థితుల్లో భూమి కొనుగోలు చేసి పట్టాలు కూడా ఇచ్చారు. అయితే ఇచ్చిన ఇళ్లస్థలాలు కాస్తా గ్రామానికి దూరంగా, ఎటువంటి రహదారి లేని కొండప్రాంతంలో ఇవ్వడం వల్లే నిర్మాణపనులు ప్రారంభించడంపై లబ్ధిదారులు అంతగా ఆసక్తి చూపడం లేదు. నిర్మాణ వ్యయం ఎక్కువ అవుతుందని ఆందోళన ఒకటైతే, అంతదూరంలో కొండ ప్రాంతంలో అందరూ ఇళ్లను నిర్మించుకుంటే సరేసరి, లేకుంటే కొద్ది మంది నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసినా నివాసముండడం, అక్కడ అవసరమైన సౌకర్యాలు కల్పించడం సమీప కాలంలో సాధ్యమౌతుందా అన్న డైలమాలో చింతలపాలెం, నరిశింగబిల్లి, జెంటపురెడ్డి తుని గ్రామాల లబ్ధిదారులెవరూ ఇళ్ల నిర్మాణానికి సాహసించడం లేదు. దీనిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపడు తుందో చూడాలి మరి.

జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల కోసం కశింకోట మండలం చింతలపాలెం వద్ద కొండ ప్రాంతంలో 129, 163, 164, 165, 166 సర్వే నెంబర్లలో 7.15 ఎకరాల డి.ఫారం పట్టా భూమిని ప్రభుత్వం సుమారు రూ.60 లక్షలకు కొనుగోలు చేసి లేఅవుట్ వేసింది. ఇక్కడ జంటపురెడ్డితుని, నరిశింగబిల్లి గ్రామాలకు చెందిన 138 మందికి, చింతలపాలెం గ్రామానికి చెందిన 148 మందికి మొత్తం 286 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలిచ్చారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి 10 నెలలు దాటినా నేటికీ ఆ లేఅవుట్‌లో ఒక్క ఇంటికి కూడా పునాది రాయి పడలేదు. ఆ లేఅవుట్‌లో ఇల్లు కట్టుకోవడానికి ఏ ఒక్క లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. కొండను ఆనుకొని నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో, గ్రామానికి దూరంగా ఇళ్ల స్థలాలు కేటాయించడం వల్లే అక్కడ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇళ్ల పట్టాలు ఇచ్చారు తప్పా అక్కడ కనీస వసతులు, చివరికి ఆ లేఅవుట్‌కు రోడ్డు మార్గం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడ ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు కన్నా మెటీరియల్ తరలించడానికే అధిక మొత్తంలో ఖర్చవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఎవరూ అక్కడ ఇంటి నిర్మాణం ప్రారంభించకపోవడంతో లేఅవుట్ మొత్తం ఏపుగా తుప్పలు పెరిగి అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. ఈ ఏడాది ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. కాని ఇక్కడ అసలు నిర్మాణమే ప్రారంభం కాలేదు.

అధికారుల దృష్టిలో ఉంది

జంటపురెడ్డి తుని, చింతలపాలెం, నరిశింగబిల్లి గ్రామాల జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించిన లేఅవుట్‌కు సరైన మార్గం లేకే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇళ్ల నిర్మాణాలకు ముందుకొచ్చిన వారికి శాఖాపరంగా సహకారం అందిస్తాం.

జి.శ్రీనివాసరావు
హౌసింగ్ ఎఇ, కశింకోట

ప్రభుత్వమిచ్చే డబ్బులు పెంచాలి



కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఆ డబ్బులతోనే ఇంటి నిర్మాణం చేయాలి. గ్రామానికి దూరంగా ఇంటి స్థలం ఇచ్చారు. లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి. ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చే డబ్బులు పెంచి ఇవ్వాలి.

- సిహెచ్.లక్ష్మి, గృహ లబ్ధిదారులు, చింతలపాలెం

ఆసక్తి ఉన్నా కట్టలేని పరిస్థితి



ఇంటిని కట్టాలని ఉంది. అయితే లేఅవుట్‌లో బోరు మాత్రమే వేశారు. దీంతో రవాణా భారం ఎక్కువ అవుతుందని అక్కడ ఇంటి నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడం లేదు. నేనొక్కడనే కట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

- బుదిరెడ్డి తాతారావు
గృహ లబ్ధిదారులు, చింతలపాలెం

అనువైన చోట స్థలమివ్వాలి



మేము ముగ్గురు కుటుంబ సభ్యులం. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. సొంత ఇంటిని నిర్మించుకోవాలని అనుకుంటున్నాం. లక్షలాది రూపాయలు అప్పు చేయాల్సి ఉంది. లేఅవుట్‌లో కనీసం నీరు కూడా లేదు. అనువైన చోట ఇళ్ల స్థలాలు ఇస్తే బాగుంటుంది.

- దమ్ము అమ్మాజీ, గృహ లబ్ధిదారులు, నరిశింగబిల్లి

రవాణా భారమే అధికం



మేము నలుగురు కుటుంబ సభ్యులం. రూ.2వేలు అద్దెకు నివాసముంటున్నాం. చింతలపాలెం లేఅవుట్‌లో ఇంటి స్థలమిచ్చినా రోడ్డు మార్గం లేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు మెటీరియల్ రవాణా ఖర్చుకు సరిపోవు. గ్రామానికి దగ్గరిలో స్థలం ఇస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాం.

- చిట్టూరి భవాని
గృహ లబ్ధిదారులు, జంటపురెడ్డి తుని

విగ్రహ ప్రతిష్టకు 'బూడి'కి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఆలయ కమిటీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : వి.మాడుగుల మండలం, ఎం.కోడూరు గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి త్రయాహ్నిక దివ్య విగ్రహప్రతిష్ట మహోత్సవానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును మండల నేతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఆదివారం తారువలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసిన నేతలు విగ్రహ ప్రతిష్టకు రావాలని కోరారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ, వేడుక సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు కార్యక్రమంలో గొల్లవిల్లి సంజీవ్, చింతల మూర్తి, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రేక్షకులు ఆదరించే చిత్రాలు తీయాలి



సినీ దర్శకుడు త్రినాధరావును సత్కరిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రేక్షకులు ఆదరించే మరిన్ని మంచి చలనచిత్రాలకు దర్శకత్వం వహించాలని టిడిపి బీసీ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర అన్నారు. అనకాపల్లిలో ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాధరావును, చలనచిత్ర నటులు ప్రసన్న కుమార్‌లను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ త్రినాధరావు దర్శకత్వంలో రవితేజ హీరోగా థమాకా చిత్రం సూపర్ హిట్ అయిందని, తదుపరి చిత్రం కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎల్లపు శ్రీనివాసరావు, నక్కిన సురేష్, భాను చంద్ర, జొన్నాడ సురేష్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి.

ప్రజశక్తి- రాజవొమ్మంగి: వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి అన్నారు, ఆదివారం రాజవొమ్మంగి వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి అధికారంలోకి వచ్చిన దాదాపు నాలుగేళ్లు పూర్తవుతున్నా కనీస అభివృద్ధి కానరాదన్నారు. మూడు రాజధానుల పేరుతో ఇన్నాళ్లుగా కాలం గడిపేశారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఎవరైనా ప్రశ్నిస్తే వైసిపి ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు.

ఎన్ని కేసులు పెట్టినా వెనక్కు తగ్గేది లేదని, వైసిపి వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామన్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు.

పొగమంచుతో పరేషాన్

ప్రజాశక్తి -మునగపాక రూరల్: మండలంలో కొద్ది రోజులుగా దట్టమైన పొగ మంచు కురుస్తోంది. వేకువజాము మూడు గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు దట్టంగా పొగమంచు కురవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. పొగమంచుతో దారిలో వచ్చే వాహనాలు కనిపించక హెడ్‌లైట్ల వెలుతురులో ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి ఉంది.సంక్రాంతికి ముందు, శీతాకాలంలో ఇలా పొగమంచు కురవడం సర్వసాదారణమైనా, ఇపుడు రథసప్తమి, శివరాత్రి తర్వాత కూడా ఇంత దట్టంగా పొగమంచు కురవడం గతంలో ఎన్నడూ లేదని పలువురు అంటున్నారు.

పొగమంచు దెబ్బకు పూత దశలో ఉన్న జీడి, మామిడి, నువ్వుల పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. అయితే వేసవి సీజన్ ప్రారంభానికి సూచికగా పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు మండుతుంటే, ఇదే సమయంలో రాత్రి వేళల్లో



హెడ్‌లైట్ల వెలుగులో ప్రయాణిస్తున్న వాహనాలు

వేకువజామున పొగమంచుతో కూడిన మిశ్రమ వాతావరణం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని పలువురు అంటున్నారు. అయితే ప్రకృతి, సౌందర్య ప్రేమికులు మాత్రం ఈ పొగమంచు అందాలను ఆస్వాదిస్తుండగా, పంటలకు నష్టం వాటిల్లుతుండడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

దేవాలయ కమిటీలో చోటు కల్పించాలి

ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి విన్నవించిన విశ్వబ్రాహ్మణులు

ప్రజాశక్తి -వడ్డాది : దేవాలయాల కమిటీల్లో విశ్వబ్రాహ్మణులకు సభ్యత్వం కల్పించాలని అనకాపల్లి జిల్లా విశ్వబ్రాహ్మణుల సంఘం ప్రధాన కార్యదర్శి గానుగుల బాబ్జి కోరారు ఆదివారం చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణుల సమస్యలను ధర్మశ్రీకి వివరించి, ప్రభుత్వపరంగా వాటిని పరిష్కరించి అండగా నిలవాలని కోరారు. విశ్వబ్రాహ్మణుల్లో నేటితరం యువత అనేక మంది కులవృత్తికి దూరమౌతున్నారని, వారికి ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగావకాశాలతోపాటు స్వయం ఉపాధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలూరి హనుమంతరావు ఫోనులో ధర్మశ్రీతోమాట్లాడి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ధర్మశ్రీ స్పందిస్తూ, సమస్యలను ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికితీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో యువజన నాయకుడు శ్రీధర్, అనకాపల్లి జిల్లా విశ్వ బ్రాహ్మణుల సంఘం కార్యదర్శి దిమిలి రాజేష్, మహిళ అధ్యక్షురాలు కోరుకొండ సంతోషి పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- రంగులు వేసి సిద్ధం చేసిన ఆలయ ప్రాంగణం- జల్లు స్నానానికి సన్నాహాలు


సుందరంగా తీర్చిదిద్దిన ఆలయం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. మార్చి 3వ తేదీన స్వామి కళ్యాణం సందర్భంగా సుధూరు ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు తరలి వస్తారు. ఇందుకుగాను టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఉపమాక – నక్కపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని స్వామివారి పుష్కరిణితో పాటు, సువిశాలమైన పెద్ద చెరువు కూడా వుంది. రాత్రి వేళల్లో పిల్లలు, వృద్ధులు నడిచి వచ్చేటప్పుడు ప్రమాదవశాత్తు చెరువుల్లోకి వెళ్లకుండా ఉండేందుకు ఆదివారం ఉదయం నుంచి సుమారు కిలోమీటరు పొడవునా రోడ్డు పక్కన చెరువు గట్లపై తాత్కాలికంగా ఐరన్ పెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ గోపురాలకు, ఇతర కట్టడాలకు, తిరు వీధి సేవలకు సంబంధించి వాహనా లకు ఇప్పటికే రంగులు వేసి సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో భక్తులు వేచి ఉండేందుకు భారీ తాత్కాలిక షెడ్డు ఏర్పాటుకు సామగ్రిని సిద్ధం చేశారు.

జల్లు స్నానం ఏర్పాటుకు చర్యలు

ఉపమాక పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు తితిదే అధికారులు జల్లు స్నానం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మార్చి 2న స్వామివారి కల్యాణోత్సవాలకు అంకురార్పణ, 3న కళ్యాణం జరగనుంది. స్వామిని దర్శించుకునేందుకు, కళ్యాణం తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. 3వ తేదీ తెల్లవారుజాము నుండి ఉపమాక జనసంద్రంగా మారనుంది. వచ్చే భక్తుల్లో అధిక సంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించి, పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటూరు.గత రెండు సంవత్సరాల నుండి పుష్కరిణి అపరిశుభ్రంగా ఉండడంతో భక్తులు స్నానాలు ఆచరించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. చెరువు అపరిశుభ్రతపై ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో కూడా అస్తవ్యస్తంగా ఉపమాక పుష్కరిణి అనే శీర్షిక ప్రచురణమైంది. స్వామివారి కల్యాణోత్సవాలు దగ్గర పడడంతో చెరువులో ఉన్న నాచు, గడ్డి, ఇతర వ్యర్థాలను ఇటీవల కూలీలతో తొలగించారు. నీరు మాత్రం కలుషితమై దుర్వాసన వెదజల్లుతూనే ఉంది. ఇప్పుడు ఏమి చేయడానికి సమయం కూడా లేదు. భక్తులు స్నానాలు ఆచరించడానికి పుష్కరిణి తప్ప మరో మార్గం కూడా లేదు. దీంతో చేసేదేమీ లేక పుష్కరిణిలో కొంతమేర భక్తులు జల్లు స్నానం ఆచరించే విధంగా తితిదే అధికారులు చర్యలు చేపట్టారు. స్నాన ఘట్టం వద్ద కొంతమేర ఐరన్ రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భక్తులు స్నానాలు ఆచరించడానికి ఏర్పాటు చేసిన స్నాన ఘట్టం వద్ద నీటిని మోటార్ల సహాయంతో శుద్ధి పరిచి, ఆ నీటితో భక్తులు స్నానాలు ఆచరించే విధంగా జల్లు స్నానం ఏర్పాటు చేస్తున్నారు. వేలాది మంది భక్తులు కొద్దిమేర స్థలంలో స్నానాలు ఆచరించడం ఇబ్బందికరమే. ఈ ఏడాది కూడా భక్తులకు ఇబ్బందులు తప్పేటట్టు లేదు. తితిదే అధికారులు ముందే మేల్కొని చెరువును శుభ్రపరచి ఉంటే బాగుండేదని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.


పుష్కరిణిలో ఏర్పాటు చేసిన ఇనుప రేకులు

మూతపడ్డ మంచినీటి శుద్ధి కేంద్రం

- శుద్ధ నీటి కోసం పలు గ్రామాల ప్రజలు అవస్థలు - వినియోగంలోకి తీసుకురావాలని వినతి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో జల్లూరు గ్రామం వద్ద గత ప్రభుత్వంలో సుజల స్రవంతి పేరుతో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రం నేడు మూతపడడంతో పరిసర ప్రాంత గ్రామస్తులు శుద్ధి చేసిన తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆనాటి ప్రభుత్వంలో హెట్రో సంస్థ, పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన పథకం ద్వారా జల్లూరు, ఎండపల్లి, తంగేడు, బీకే కొత్తపల్లి, సుంకపుర్ గ్రామాలకు పరిశుభ్రమైన తాగునీరు అందేది. ప్రస్తుతం జల్లూరు గ్రామ పంచాయతీ సంకపూరు సచివాలయంలో ఉండడంతో నిధుల కొరత, సిబ్బంది లేమి కారణంగా గడిచిన మూడు సంవత్సరాలగా వాటర్ ప్లాంట్ మూతపడటంతో విలువైన పరికరాలు దెబ్బతినే అవకాశం ఉంది.అధికారులు గుర్తించి తాగునీటి శుద్ధి ప్లాంటును వినియోగంలోకి తీసుకు రావాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.


మూతపడిన మంచినీటి శుద్ధి కేంద్రం



ఆకట్టుకున్న శక్తి వేషాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో ఆదివారం రజకుల పండుగను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ అనంతరం ఫిబ్రవరి నెలలో రజకులు పండుగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. రజకులు పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజకుల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి వేషాలు ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

జగనన్న కాలనీల్లో కానరాని కనీస వసతులు

రోడ్డు సౌకర్యం లేక లబ్ధిదారుల అవస్థలు


కోటవురట్ల తుపాకి గెడ్డ వద్ద కాలనీ

ప్రజాశక్తి–కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన జగనన్న కాలనీ నిర్మాణాల వద్ద కనీస వసతులు లేక నిర్మాణదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలో పెట్రోల్ బంకు సమీపంలో సుమారు 167 ఇల్లు మంజూరు కాగా 120 మంది వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. సదరు కాలనీకి రోడ్డు కేటాయించక పోవడంతో నిర్మాణదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఒక ప్రైవేటు వ్యక్తి స్థలంలో నుంచి నిర్మాణదారులు రాకపోకలు సాగిస్తున్నారు. తుపాకీ గెడ్డ వద్ద నిర్మిస్తున్న కాలనీకి రహదారి సౌకర్యం లేక పోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గెడ్డపై నిర్మించిన కల్వర్టు అసంపూర్తిగా వదిలి వేయడంతో సమీపంలో ఎంపీడీవో కార్యాలయం ప్రహరీ గోడ కూల్చి నిర్మాణదారులకు దారి సమకూర్చారు.జల్లూరు జగనన్న కాలనీకి రోడ్డు సౌకర్యం లేదు. దీంతో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించేందుకు ఆసక్తి చూపకపోవడంతో నేటికీ అక్కడ నిర్మాణాలు మొదలు కాలేదు. పాములవాక వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనికి రోడ్డు మార్గం సక్రమంగా పోవడంతో నిర్మాణదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. అధికారులు, నాయకులు స్పందించి ఆయా ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు.



పాముకపాక కాలనీ వద్ద రోడ్డు దుస్థితి


పెట్రోల్ బంద్ సమీపాన కాలనీకి కానరాని రోడ్డు(ఫైల్)


చేపడుతున్న సాగునీటి కాలువ పనులు

శరవేగంగా సాగునీటి కాలువ పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో పాములవాక ఏలేరు కాలువపై రాజుగారి కట్ట వద్ద రూ.1.90 కోట్లతో జీవీఎంసీ, విశాఖ ఇండస్ట్రీ వాటర్ కంపెనీ నిర్మిస్తున్న సాగునీటి కాలువ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. సదరు పనులు స్థానిక వైసిపి నాయకులు మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ప్రోద్బలంతో జరుగుతుండటం పట్ల స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2012లో సంభవించిన నీలం తుఫానులో శిథిలమైన ఈ సాగునీటి వంతెన నాటి నుంచి నేటి వరకు నిర్మాణం చేపట్టక పోవడంతో స్థానిక రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఈ కాలువ నిర్మాణం పనులు మార్చి నెలాఖరకు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీరు అందిస్తామని ఇంజనీర్ నానాజీ తెలిపారు.


మరమ్మతు చేపడుతున్న కూలీలు

రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి- కోటవురట్ల:నాతవరం మండలం వెన్నెల పాలెం వద్ద ఆర్ అండ్ బి అధికారులు గతుకుల రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. తాండవ జంక్షన్ నుండి నాతవరం వెళ్లే రోడ్డు పలుచోట్ల గతుకులమయం కావడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం చేపడుతున్న పనులతో వాహనదారులకు సమీప గ్రామస్తులకు కాస్త ఊరట లభించనుంది. ఈ విషయమై స్థానిక ఆర్అండ్బి అసిస్టెంట్ ఇంజనీర్ జై రాజు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజవర్గంలో పలు రోడ్ల మరమ్మతుకు మూడు లక్షల మంజూరు అయ్యాయన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -యస్.రాయవరం:మండలంలోని దార్లపూడి గ్రామానికి చెందిన పినపోలు బాబురావు చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుని భార్య లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్త బాబురావు మద్యానికి బానిసగా మారి పోవడంతో ఈ నెల 20 వ తేదీన మధ్యాహ్నం తమ ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తమ వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగులమందు సేవించి అపస్మారక స్థితిలో ఉండగా 108 లో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టిఆర్ ఆసుపత్రికి అక్కడి నుండి విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు.చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడని ఆమె తెలిపారు.

మార్కెట్ సౌకర్యం కల్పనకు కృషి

ప్రజాశక్తి–హుకుంపేట:ఏజెన్సీ ప్రాంతాల్లో తయారవుతున్న నాణ్యమైన బెల్లాన్ని మార్కెట్లో అనుమతించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని జెడ్పీటీసి రేగం మత్స్య లింగం అన్నారు. మండలంలోని దుర్గం, మత్స్యపురం పంచాయతీ నిట్టపుట్టు, ఉప్ప, తదితర ప్రాంతాల్లో గిరిజనులు పండిస్తున్న బెల్లంను జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం ఆదివారం పరిశీలించారు. బెల్లంకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తెలియ చేస్తానని తెలిపారు. తాము ఎంతో శ్రమించి కష్టపడుతున్నా గిట్టుబాటు ధర రాలేదని రైతులు అన్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పంచాయతీ కార్యదర్శి లోవరాజు మృతి



ప్రజాశక్తి-గొలుగొండ:అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చిట్టింపాడు గ్రామానికి చెందిన గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురం గ్రామ సచివాలయంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న దవల లోవరాజు(26) తీవ్ర అనారోగ్యంతో విశాఖపట్నం కేజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత వారం రోజులుగా పచ్చకామెర్లతో బాధపడుతున్న లోవరాజు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో చికిత్స పొందారు. కొద్దిగా నయం కావడంతో మరల విధులకు హాజరైనట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. పచ్చకామర్ల వ్యాధి తీవ్రత కావడంతో విశాఖపట్నం కేజిహెచ్‌కు తరలించినప్పటికీ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అందివచ్చిన కుమారుడు మృతి చెందడంపై కుటుంబీకులు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కాగా లోవరాజు పార్థవదేహాన్ని నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ్ సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతరం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.



సన్మానిస్తున్న నూతన సభ్యులు

వాసవి క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:వాసవీ క్లబ్ సమాజానికి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని వాసవీ క్లబ్ అంతర్జాతీయ జిల్లా గవర్నర్ శ్రీనాథ్ శ్రీనివాసరావు తెలిపారు. వాసవీ క్లబ్ నర్సీపట్నం ఆయుష్మాన్ భవ, ఏటిగైరంపేట వాసవి క్లబ్ 2023 క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారంను కుసుమంచి రామకృష్ణ ఇంటి దగ్గర ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ జిల్లా నాయకులు మాట్లాడుతూ, గోపూజ, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. నర్సీపట్నం క్లబ్‌లో కుసుమంచి రామకష్ణ ప్రెసిడెంట్ గానూ, లక్ష్మణ్ సెక్రటరీగానూ, ఏటి గైరంపేట క్లబ్ ప్రెసిడెంట్‌గా కేతవరపు భాస్కరరావు, సెక్రటరీగా శ్రీనివాసరావు, ట్రెజరర్గా సత్యనారాయణను నియమించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు

ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలి

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరపాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. విలేకర్లకు ఆయన వీడియోను విడుదల చేశారు. తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఏర్పాటు చేసిన ఎన్నికల సమావేశానికి ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్లర్ ఎందుకు పాల్గొన్నారని ప్రశ్నించారు. సుబ్బారెడ్డి ఏది చెబితే అది చేయడం ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేయవచ్చా, ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ రాజకీయ సమావేశానికి ఏయూ వైఎస్ చాన్సలర్ హాజరు కావడంపై అధికారులు చేపట్టిన విచారణపై విమర్శలు గుప్పించారు. విచారణ చేయమని జిల్లా కలెక్టర్ ఆర్డిఓకు తెలియజేస్తే ఆయన విచారణలో ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ పాల్గొన లేదని నివేదిక ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌ఛాన్సలర్ ఆయనకు కనిపించలేదా.. 'మీకు కనిపించక పోతే ఆ ఫోటోని ఫోరెక్స్ లాబ్‌కు పంపించాలన్నారు. ఫోటోలతో సహ ఆయనపై రాష్ట్ర ఎన్నికల కమిషన్కు ఫిర్యాదు చేశామని, తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే ఆర్డీవో హుస్సేన్ ఈ విధంగా వ్యవహరించారని పేర్కొన్నారు.

జోరుగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం



బీచ్‌లో ప్రచారం చేపడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆదివారం రమాప్రభ మద్దతుదారులు వాడవాడలా తిరిగి ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తేందుకు రమాప్రభకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎంవిపికాలనీ:విశాఖ తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు సహా ఆర్‌కె.బీచ్‌లో కోరెడ్ల రమాప్రభ ప్రచారం విస్తృతంగా సాగింది. బీచ్ రోడ్డులోని వైఎంసిఎ నుంచి సబ్‌మెరైన్ వరకూ నిర్వహించిన ప్రచారంలో రమాప్రభ పాల్గొన్నారు. పిడిఎఫ్ తరుపున పోటీచేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మనవి చేశారు. తాను రాజకీయపార్టీలకు అతీతంగా 250కు పైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఉత్తరాంధ్ర గొంతు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పిడిఎఫ్ అభ్యర్థిని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకుని ఓటర్లను గందరగోళ పరిచేందుకు ఇంకో రమాప్రభను పోటీలో పెట్టి ఓట్లు చీల్చడానికి పెద్దకుట్ర పన్నాయన్నారు. ఆ విషయాన్ని పట్టభద్ర ఓటర్లు గ్రహించి అధికార, ప్రతిపక్ష పార్టీలకు తగిన బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార క్యాంపెయిన్‌లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు జిఎస్.రాజేశ్వరరావు, వార్డు నాయకులు ఎం.శివనాగేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు సత్యన్నారాయణ, ఐద్వా జోన్ కార్యదర్శి కె.కుమారి, ప్రజానాట్య మండలి నాయకులు దండు నాగేశ్వరరావు, ఎం.చంటి, పి.వెంకటరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ రాంనగర్ ప్రాంతంలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. కె.నరసింగరావు, ఎం.సూరీడు, ఎం.సుబ్బారావు, అప్పలరాజు, రామారావు పాల్గొన్నారు.

మాధవధార : పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఆదివారం తెన్నేటినగర్ ప్రాంతంలో వివిధ సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూన వెంకటరావు, పి.రామారావు, ఎస్ శ్రావణ్ కుమార్, బి.పాపారావు, ఎస్.హరిబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలసలో సిఐటియు నాయకులు ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటును వేసి కోరెడ్ల రమాప్రభను ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరుతూ పట్టభద్రులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు

పెందుర్తి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ఎస్ఆర్.పురం, జుత్తాడ గ్రామాలో ప్రజా సంఘ నాయకులు ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ప్రచారంలో సిఐటియు నాయకులు బి.జగన్, శంకరరావు, డి.వెంకటరమణ, మహిళ సంఘం నాయకులు బి.రమణి పాల్గొన్నారు.

సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నిస్తా



పెందుర్తిలో...

అనకాపల్లి : ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, రైతు మహిళా ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో ప్రశ్నిస్తామని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. సమస్యలపై ప్రశ్నించే గొంతు వినిపించాలంటే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉద్యోగ పట్టభద్రులను కోరారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎం. నాగభూషణం, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, మళ్ల స్వామి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుసంఘాల నేతల విస్తృత ప్రచారం

కె.కోటపాడు : ప్రజల సమస్యలపై ప్రశ్నించే వ్యక్తిని శాసనమండలికి పంపిద్దామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు, ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు కోరారు. ఆదివారం మండలంలోని గాలివలస గ్రామంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ విస్తృతం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వనమ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ప్రచారం

చోడవరం:పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ప్రధమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరుతూ ఎల్ఐసి ఐసియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ఐసి నాయకులు లవరాజు, అప్పారావు, శ్రీను, కల్యాణ్, గణేష్ డివైఎఫ్ఐ నాయకులు నాయుడు, గణేష్, కెవిపిఎస్ నాయకులు చంద్రరావు పాల్గొన్నారు.



చోడవరంలో...



మాధవధారలో చేపడుతున్న ప్రచారం

పాడేరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ శెట్టి నాగరాజు తెలిపారు. ఆదివారం పాడేరు కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రమాప్రభను ఎమ్మెల్సీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఇప్పటికే శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సమస్యలు పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి ఎంతో ఉందని తెలిపారు. మనం చేస్తున్న ఉద్యమాలకు చేదోడు వాదోడుగా ఉంటూ మన సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గత తెలుగుదేశం ప్రస్తుతం వైసీపీ, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నాయన్నారు. పని ఒత్తిడి పెంచుతూ కనీస వేతనాలు అమలు చేయలేదని తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జిసిసి, మెడికల్ అండ్ హెల్త్, గిరిజన గురుకులాలు, ట్రైబల్ వెల్ఫేర్, ఐటిడిఏ, టూరిజం ఇతర ప్రభుత్వ శాఖల్లో వందలాది మంది కార్మికులు ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కే.లక్ష్మణరావు, మహేష్ పాత్రుడు, నాగరాజు, వీరన్న పడాల్, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

దుంబ్రిగూడ:ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని పట్టభద్రులకు కరపత్రాలను పంచారు. ప్రజా సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో కొత్తగా వేస్తున్న పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 451వ రోజుకు చేరింది. ఆందోళన శిబిరం వద్ద ఆదివారం పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు పచ్చి ఆకుల కొమ్మలు మెడలకు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పైప్ లైన్‌ను వ్యతిరేకిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 451 రోజుల నుండి పైప్ లైన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తుంటే పట్టించుకోకుండా పైప్‌లైన్‌కు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. వేట తప్ప మరో జీవన విధానం తమకు తెలియదని, పైప్‌లైన్‌కు అనుమతులు ఇచ్చి పొట్టపై దెబ్బ కొట్టొద్దన్నారు.ఇప్పటికే ఉన్న పైప్ లైన్‌తో మత్స్య సంపద నశించి పోవడంతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేస్తే తమ బతుకులు ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పైపులైన్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు .లేనిపక్షంలో సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల స్వామి, మైలపల్లి శివాజీ, చేపల రమేష్, పి.జగ్గా, కాశీరావు, కారే కోదండరావు, కొత్తవల జగ్గా పాల్గొన్నారు.



కొమ్మలు కట్టుకుని నిరసన చేపడుతున్న మత్స్యకారులు



సభ్యత్వ నమోదును ఇస్తున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖా గ్రంథాలయం లో చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహించారు. పిల్లలకు కథల పుస్తకాలు చదివించి, లెక్కల్లో మ్యాజిక్ వంటి ఆటలు నిర్వహించారు. కొత్తగా 10 మంది విద్యార్థులు గ్రంథాలయ సభ్యులుగా చేర్చుకున్నారు. గ్రంథాలయంను వినియోగించుకోవాలని లైబ్రేరియన్ పి దమయంతి కోరారు.